సాక్షి
బాపట్ల

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



శివాలయానికి రూ.5 లక్షల విరాళం

మంగళగిరి: మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి వైఎస్ఎన్ సీ ఫుడ్స్ ఎండీ సింగంశెట్టి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ మన్నవ సందీప్‌లు రూ. ఐదు లక్షలు విరాళంగా అందజేశారు.



సబ్‌జైలు పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్ శనివారం పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీటిని తనిఖీ చేశారు.

రూ.4 లక్షలతో అలంకరణ



అద్దంకి రూరల్: అద్దంకిలోని వేయిస్తంభాల దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సుమారు రూ.4 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

● వాత్సల్య రూపిణీ.. కరుణాకరీ..



దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాత్సల్య రూపిణి అయిన లలిత త్రిపుర సుందరీదేవిని వేలాది మంది భక్తులు దర్శించుకొని తరించారు. భక్తుల సౌకర్యాలను దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో పాటు ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

– ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)

పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు
- అమరవీరులకు నివాళులర్పించిన పోలీసులు

బాపట్లటౌన్: పోలీసు అమరవీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఏఆర్ సిబ్బంది ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పేరెడ్ నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద రాజ్యసభ సభ్యులు మోపిదేవి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల వివరాలతో ఉన్న 'షహీద్ పుస్తక్ టోలిని ఎంపీ మోపిదేవికి ఆర్ఎస్ఐ సుధాకర్ అందించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా పోలీసులు నిర్వహించిన ర్యాలీని మోపిదేవి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అసాంఘిక శక్తులతో పోరాడుతూనే అసువులు బాసిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మోపిదేవి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలు నెలకొల్పడానికి పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దిశ యాప్ ద్వారా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందన్నారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి ప్రజల ప్రాణ, ఆస్తిని కాపాడతారన్నారు. పోలీసు అమరవీరుల సేవలను




మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వేదికపై ఎంపీ నందిగం సురేష్, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ సునీత

ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడం కోసం అహర్నిశలు శ్రమించే పోలీసులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడడంతో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సెల్యూట్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దిశ యాప్ నేడు దేశానికే దిక్సూచిలా' మారిందన్నారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా నూతనంగా ఏర్పడినప్పటికీ శాంతిభద్రతలు పరిరక్షించేందుకు విశేష కృషి చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు 40 శాతం తగ్గాయన్నారు. సూర్యలంక బీచ్‌లో 26 మంది ప్రాణాలను పోలీసులు కాపాడారన్నారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు, యాసం మస్తాన్‌బాబు కుటుంబ సభ్యులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, చీరాల డీఎస్పీ ఎల్.ప్రసాద్‌రావు, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.రమణ, ఎస్‌బీ సీఐ వి.సూర్యనారాయణ, జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పరేడ్ గ్రౌండ్‌లో స్మృతి పరేడ్ చేస్తున్న ఏఆర్ సిబ్బంది

లలితా త్రిపుర సుందరీదేవిగా బాలచాముండేశ్వరీదేవి



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శ్రీబాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శనివారం బాలచాముండేశ్వరి అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో ఏడో రోజు లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో బాలచాముండేశ్వరి అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చన పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసుర మర్దని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాత్కాలికంగా 'స్పందన' రద్దు

బాపట్లఅర్బన్: విజయదశమి పండుగ సందర్భంగా సోమవారం స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీలు ఇవ్వడానికి జిల్లాలోని ప్రజలెవ్వరూ బాపట్లకు రావద్దని, ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌కు అవార్డు

గుంటూరుఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌ను 2022–23 విద్యాసంవత్సరానికి టాప్ ప్లేస్‌మెంట్ పెర్ఫార్మర్ అవార్డు వరించింది. ఏఎన్‌యూలో ఈనెల 19న పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి–శిక్షణశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సీహెచ్ నాగరాణి చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు, ట్రెనింగ్–ప్లేస్‌మెంట్ అధికారి ఆర్.లోకేష్ ఈ అవార్డు అందుకున్నారు. వీరికి శనివారం కళాశాలకు చెందిన అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఉర్దూ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి

రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ బాజీవలి



అద్దంకి రూరల్: పట్టణంలోని షాదీఖానాలో ఉర్దూ గ్రంథాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మట్టలపూడి బాజీవలి అన్నారు. శనివారం అద్దంకి పట్టణంలోని షాదీఖానాని పరిశీలించారు. ఈ సందర్భంగా బాజీవలి మాట్లాడుతూ షాదీఖానాలోని మరమ్మతుల కోసం నిధుల మంజూరుకు సహకరిస్తామన్నారు. అలాగే ఉర్దూ గ్రంథాలయంతో పాటు ఉర్దూ కంప్యూటర్ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ డైరక్టర్ మస్తాన్‌వలి, అద్దంకి పట్టణ షాదీఖానా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మౌలాలి, 17వ వార్డు కౌన్సిలర్ షేక్ జబ్బార్, షేక్ ఖాజావలి, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'ప్రతిభామూర్తులు.. మధుర స్మృతులు'



అద్దంకి రూరల్: ప్రతిభామూర్తుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సాహితీ స్రవంతి అధ్యక్షుడు చందలూరి నారాయణరావు అన్నారు. శనివారం రాత్రి ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి గాడేపల్లి శీతారామమూర్తి జయంత్రి సందర్భంగా 'ప్రతిభామూర్తులు-మధురస్మృతులు' కార్యక్రమం నిర్వహించారు. పద్మశ్రీ అల్లు రామలింగయ్య, కవయిత్రి కమ్మర మొల్లమాంబ, గాడేపల్లి సీతారామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి జీవిత విశేషాలను పలువురు వక్తలు వివరించారు. కార్యక్రమంలో సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, పసుపులేటి ఆంజనేయులు, నర్రా గోపాలరావు, యు.దేవపాలన, మన్నం త్రిమూర్తులు, వీరవల్లి రుద్రయ్య, డీవీఎం సత్యనారాయణ, ఆర్వీ రాఘవరావు, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి భవనాల అప్పగింత

- ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాల పూర్తికి కసరత్తు
- వారానికి రెండురోజులు కలెక్టర్ సమీక్ష
- గడువులోగా అన్ని భవనాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశం



చీరాల మండలం దేవంగాపురంలో పూర్తి అయిన రైతు భరోసా కేంద్రం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగమైన ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలను వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా అధికారులకు రాష్ట్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో భవననిర్మాణ పనులను సత్వరమే పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా జిల్లాలో రూ.187.55 కోట్లతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌కినిక్‌లకు సంబంధించిన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లకు సంబంధించి 40 శాతం భవనాలు మాత్రమే పూర్తికాగా రైతుభరోసా కేంద్రాలు 55 శాతం, గ్రామ పంచాయతీ సచివాలయాలు సగం పూర్తయ్యాయి. వీటిని త్వరగా పూర్తిచేసి ఆయా శాఖలకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పంచాయతీరాజ్ ఎస్ఈ హరేరామ, డ్వామా పీడీ శంకర్‌నాయక్ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులుకూడా కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నందున భవననిర్మాణ పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయంటూ అధికారులను ప్రశ్నించారు. ఇకనుంచి క్షేత్రస్థాయిలో ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక యాప్ అప్లికేషన్ ద్వారా భవననిర్మాణ పనులను నిత్యం మానిటరింగ్ చేయాలన్నారు.

- జిల్లాలో 249 గ్రామపంచాయతీల పరిధిలో 285 సచివాలయ భవననిర్మాణ పనులు జరుగుతుండగా వాటిలో రూఫ్ దశలో 9 పనులు, రూఫ్‌లేయర్ దశలో 34 పనులు, సెకండ్ రూఫ్ లెయిర్ పరిధిలో 99 పనులు జరుగుతున్నాయి. 14 పనులు ఫినిషింగ్ దశలో ఉండగా 7 పనులు నూరుశాతం ఫినిషింగ్ దశలో ఉన్నాయి. ఇప్పటికే 122 భవనాల పనులు పూర్తిచేసి కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి అప్పగించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ .116.26 కోట్లు ఖర్చు చేస్తోంది.
- జిల్లాలో 138 గ్రామపంచాయతీల పరిధిలో 149 డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ లను ప్రభుత్వం నిర్మిస్తోంది. వీటిలో 17 భవనాలు రూఫ్ దశలో, 83 భవనాలు రూఫ్ లెయిడ్ దశలో ఉండగా 14 భవనాలు ఫినిషింగ్ దశలో ,1 భవనం నూరుశాతం ఫినిషింగ్ దశలో ఉన్నాయి. 34 భవనాల నిర్మాణాలు పూర్తయి సంబంధిత శాఖకు అప్పగించారు. వీటినిర్మాణానికి మొత్తం రూ.33. 81 కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- జిల్లా వ్యాప్తంగా 130 గ్రామపంచాయతీల పరిధిలో 139 రైతుభరోసా కేంద్రాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. వీటిలో 7 భవనాలు రూఫ్ దశలో, 62 భవనాలు రూఫ్ లెయిడ్ దశలో , 4 భవనాలు ఫినిషింగ్ దశలో ఉండగా 5 భవనాలు నూరుశాతం పూర్తిదశలో ఉన్నాయి. 61 భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తికాగా వాటిని ప్రభుత్వానికి అప్పగించారు. వీటి నిర్మాణానికి రూ .37. 48 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

వేగంగా భవన నిర్మాణాలు



జిల్లాలో ఉపాధిహామీ నిధులతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనుల నిర్మాణం పూర్తయి బిల్లులు పెట్టిన వారంలోపే బిల్లులు ఇవ్వడం జరుగుతోంది. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. జిల్లా కలెక్టర్ పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నారు.

– శంకర్ నాయక్, డ్వామా పీడీ, బాపట్ల జిల్లా

సచివాలయంలో ట్రైనీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

నకరికల్లు: విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా ఉండాలని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ, సంక్షేమపథకాలు, లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పాలన చేస్తుందని అన్నారు. సచివాలయ సిబ్బంది పనితీరుతో ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన రీసర్వే గ్రామసభలో పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, మేడికొండ రామిరెడ్డి, సర్పంచి అరవా ఆదిలక్ష్మీ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లపై పోలీసుల దాడి



ఇసుక రీచ్‌ల్లోని ఇసుకను సీజ్ చేసిన సెబ్, రెవెన్యూ అధికారులు

బాపట్లటౌన్: ఇసుక రీచ్‌లపై సెబ్, రెవెన్యూ అధికారులు దాడిచేసిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. సెబ్ సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం మండలంలోని కుక్కలవానిపాలెం గ్రామంలో ఇసుక రీచ్‌లపై రెవెన్యూ, పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడిలో కుక్కలవానిపాలెం సమీపంలోని సర్వేనెంబర్ 317లో 1000 టన్నుల ఇసుకను సీజ్ చేసి అక్కల శ్రీనివాసరెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా సర్వేనెంబర్ 312లో 400 టన్నుల ఇసుకను సీజ్‌చేసి మంచాల రామిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. సర్వేనెంబర్ 312/2ఎలో 400 టన్నుల ఇసుక సీజ్‌చేసి కావూరి గిరిరెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. సర్వేనెంబర్ 317లో 400 టన్నుల ఇసుకను సీజ్‌చేసి మరుప్రోలు గురవారెడ్డిను అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేశారు.

వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- తగిన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించండి
- జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్



శనగ విత్తనాలను అందజేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్యామ్ ప్రసాదు, చైర్మన్ సాయి మార్కొండారెడ్డి

నరసరావుపేట: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వివిధ పంటలను సాగుచేస్తున్న రైతులకు ఆర్‌బీకేల ద్వారా తగిన అవగాహన కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ మండలాల్లో అర్హులైన కౌలు రైతులందరికీ రుణాలు అందేలా చూడాలన్నారు. వ్యవసాయంతో పాటు కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, కూరగాయల సాగుపై దృష్టిసారించేలా వారిని చైతన్యం చేయాలన్నారు. దీనివలన వారికి నికర ఆదాయం లభిస్తుందన్నారు. పశువుల మేత సరిపడా ఉండేలా చూసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో సాగునీరు అంతగా అవసరంలేని శనగపంటను పండించేందుకు వారికి అవసరమైన విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేయాలన్నారు. చైర్మన్ మార్కొండారెడ్డి మాట్లాడుతూ ఆర్‌బీకేలు, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పండించుకోవాల్సిన పంటలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, అధికారులు, సలహామండలి సభ్యులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పంచదార స్టాకు పొజిషన్ వెంటనే తెలియజేయండి..

నరసరావుపేట: జిల్లాలో పంచదార స్టాకు పొజిషన్ తెలుసుకునేందుకు వెంటనే ప్రభుత్వ పోర్టల్‌లో వివరాలను అప్‌డేట్ చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాదు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో చక్కెర వ్యాపారులు, హోల్‌సేల్, రిటైల్, బిగ్ చైన్ రిటైలర్, ప్రాసెసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చక్కెర నిల్వుంచటం, నల్లబజారుకు తరలించటం నిరోధించేందుకు, వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వ జీఓఐ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కొత్తూరి కిషోర్‌బాబు, అధికాలు, వ్యాపారులు పాల్గొన్నారు.







నా మాటలను వక్రీకరించి అబద్ధాలు వండివార్చారు



నరసరావుపేటలోని మీడియాతో మాట్లాడుతున్న వినుకొండ ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: 'వైఎస్సార్ సీపీ వారు ఓట్లు వేయనీయకుండా టీడీపీ వారు అడ్డుకోవాలంటే నన్ను దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని' తాను అంటే దానికి విపరీతార్థాలు జోడించి, వక్రీకరించి టీడీపీ అనుకూల దిన పత్రికలో రాయటం దారుణమని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. ఆ దినపత్రికలో(సాక్షికాదు) తనపై వచ్చిన వార్తకు స్పందిస్తూ నరసరావుపేటలోని తన స్వగృహంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఆ పత్రికలో వచ్చిన వార్త దారుణమైందన్నారు. వడ్డెంగుంటలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి తాను వెళ్లానని, అక్కడ ఓ వ్యక్తి మీరెలా ఓట్లు వేసుకుంటారని ప్రశ్నించాడన్నారు. దీనిపై తాను మా పార్టీ వారు ఓట్లు వేయకుండా మీరు అడ్డగించాలనుకుంటే ఈ బ్రహ్మనాయుడును దాటుకొని వెళ్లాల్సి ఉంటుందని తాను హెచ్చరించానన్నారు. అది సాధ్యంకాదని, ఎవరి ఓట్లు వారు వేసుకోవాలని సూచించానన్నారు. రుబాబు చేస్తానంటే కుదిరేపని కాదని చెప్పానన్నారు. తాను మాట్లాడిన మాటల్లో కొంతమేర కట్‌చేసి ఓట్లు మీరెలా వేస్తారో చూస్తానని తాను అన్నట్లుగా టీడీపీ అనుకూల పత్రికలో రాశారన్నారు. ప్రస్తుతం ఎవరు ఎవరిని బెదిరిస్తున్నారో, ఎవరు ఏవిధంగా మాట్లాడుతున్నారో ప్రజలు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో లేని ఓట్లు ఉన్నట్లుగా టీడీపీ వారు రిగ్గింగ్ చేస్తున్నారన్నారు. రిగ్గింగ్, దొంగ ఓట్లు వేసే సంస్కృతి టీడీపీ వారిదని, దీనిని ఆపాలనేది తన అభిమతమన్నారు. వారు రిగ్గింగ్ చేస్తుంటే తాను చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. బెదిరించి ఓట్లు వేసేది టీడీపీ వారిదేనన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర లాంటి టీడీపీ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని దూషిస్తూ మాట్లాడుతున్నారన్నారు. ఈ నరేంద్ర, అతని కుటుంబ సభ్యులు రైతులు పెట్టుకున్న సంగం డెయిరీని పూర్తిగా లాగేసుకొని రూ.వందలకోట్లు దోపిడీ చేస్తున్నారన్నారు.

మార్కెట్లో దసరా ఆఫర్లు

- ఫర్నిచర్, ఆభరణాలు, వాహన కొనుగోళ్లపై ప్రత్యేక డిస్కౌంట్లు
- ఉచిత బహుమతులతో ఆకర్షిస్తున్న మొబైల్ షాపులు
- కొనుగోలుదారులతో కిటికిటలాడుతున్న దుకాణాలు



పాత గుంటూరు: దసరాకి షోరూం యాజమాన్యాలు కురిపిస్తున్న ఆఫర్లతో గుంటూరుతో పాటు జిల్లాలోని పట్టణాల్లో వస్త్ర దుకాణాలు, ఫర్నిచర్ షాపులు, మొబైల్ షాపులు, బ్రాండెడ్ షోరూంలు, నగల దుకాణాల్లో డిస్కౌంట్ల సందడి నెలకొంది. కార్లు, బైక్ ల షోరూంలో ఎక్ఛేంజ్ మేళాలు, ఆఫర్లు, ప్రత్యేక డిస్కౌంట్లు, విలువైన ప్రత్యేక బహుమతులు, బంపర్ లక్కీడ్రాలు అందిస్తున్నాయి. వస్త్ర కొనుగోళ్లపై 20 నుంచి 50 శాతం వరకు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తున్నారు. ప్రధానంగా ద్విచక్రవాహన షోరూంలలో పాత వాటిని తీసుకొని కొత్త వాహనాలను అందించడమే కాకుండా ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఫర్నిచర్ షాపుల్లో టేబుల్స్, బెడ్స్, సోఫాసెట్లు, గ్రైండర్లు, కుర్చీలు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్ ఓవెన్‌తోపాటు ఇతర సామగ్రి కొనుగోళ్లలో 25 శాతంకు పైగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు.

మొబైల్ కొనుగోళ్లు

తదితర ప్రాంతంలో మొబైల్ షాపుల్లో స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి బహుమతులు అందజేస్తున్నారు. హెడ్సెట్, బ్లూటూత్, హోం థియేటర్, పవర్ బ్యాంక్, బ్లూటూ అహెడ్సెట్ ఇలా ప్రతీ కొనుగోలుపై ప్రత్యేక బహుమతులు అందిస్తున్నారు. దసరా పండగ వరకు కొనుగోలుదారుల్లో పండగ రోజు లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి విలువైన వస్తువులను బహుమతిగా అందించనున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

కొనుగోలు పై ప్రత్యేక డిస్కౌంట్లు

బ్రాడీపేట, లక్ష్మీపురం, పట్నం బజారు, గోల్డ్ షోరూంలలో ప్రత్యేక డిస్కౌంట్లు అందిస్తుండడంతో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. బంగారం ధర అధికంగా ఉన్నప్పటికీ షోరూం యాజమాన్యాలు అందిస్తున్న డిస్కౌంట్లతో కొనుగోళ్లు పెరిగాయని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో చెన్నై యువకుడు మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన చెన్నైకు చెందిన ఓ యువకుడు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. ఎస్ఐ కె.కమలాకర్ వివరాల ప్రకారం.. చెన్నై అన్నానగర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు కిషోర్(23), ఆర్‌వీ వెట్రి బైక్‌పై చెన్నై నుంచి ఒడిశా రాష్ట్రం వెళ్తున్నారు. శుక్రవారం ఉదయం మార్టూరు జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఇద్దరు కింద పడిపోయారు. ప్రమాదంలో గాయపడిన ఇరువురిని చిలకలూరిపేట 108 సిబ్బంది గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కిషోర్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వెట్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీర్ల అంకాలమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన పీఆర్కే దంపతులు



పట్టు వస్త్రాలు సమర్పించడానికి కుటుంబ సమేతంగా వస్తున్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి

కారెంపూడి: పల్నాటి రణ క్షేత్రం కారెంపూడిలో కొలువు దీరిన పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లిని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) దంపతులు శుక్రవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ముఖద్వారం నుంచి అమ్మవారి పట్టు వస్త్రాలతో తరలివస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కేకు చిన్నారులు కోలాట ప్రదర్శన, స్థానిక ప్రజలు పూల వర్షంతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లికి ప్రభుత్వ విప్ పీఆర్కే ఆయన సతీమణి రమ, కుమారుడు గౌతమ్ రెడ్డి, డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో పీఆర్కే దంపతులకు వేద పండితులు ఆశీర్వాదం అందించారు. అనంతరం అదే ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, గంగా పార్వతీ సమేత మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం చారిత్రక ప్రసిద్ధి చెందిన పల్నాటి చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ అధికారులు పూర్ణకుంభంతో ప్రభుత్వ విప్ పీఆర్కేకు స్వాగతం పలికారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం చెన్నకేశవుని, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో సరస్వతీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పీఆర్కే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

